క్లుప్తంగా

విద్యార్థులంతా శ్రద్ధగా చదవాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎస్‌వి భాస్కరరావు

సీతమ్మధార: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ద్వారకానగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు ముఖ్య అతిథి నాలుగో పట్టణ క్రైం ఎస్‌ఐ భాస్కరరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా శ్రద్ధగా చదివి తల్లిదండ్రుల ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. స్వాతంత్య్ర సమరయోధుల జీవిత చరిత్రలు చదివి, వారి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల్వర్టు మరమ్మతులకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట హరిజన వీధిలో శిథిలావస్థ డ్రెయిన్ కల్వర్టు కారణంగా స్థానికులు పడుతున్న ఇబ్బందులపై 'ప్రమాదకర స్థితిలో కల్వర్టు' అనే శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురించిన వార్తకు జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ కార్యనిర్వాహక ఇంజనీర్ స్పందించారు. కల్వర్టు మరమ్మతులు చేయడానికి పాలనా పరమైన ఆమోదం పొంది, తదుపరి టెండర్ ప్రక్రియ ద్వారా ఈ పనిని కాంట్రాక్టర్‌కు అప్పగిస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలో కల్వర్టు పునరుద్ధరణ పనిని చేపట్టి పూర్తి చేస్తామని, తద్వారా ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూస్తామని తెలిపారు.

31న కౌన్సెలింగ్

మధురవాడ: బక్కన్నపాలెంలోని ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ శిక్షణ, ఉత్పత్తి కేంద్రంలో 2024–25 విద్యా సంవత్సరానికి ఐటీఐ ట్రేడుల్లో పురుష దివ్యాంగ యువతను చేర్చుకునేందుకు మూడో దశ కౌన్సెలింగ్‌ను ఈ నెల 26 వరకు దరఖాస్తు చేసుకోవాలని, 31న హాజరు కావాలని పీవో జి.మాధవి తెలిపారు. శిక్షణ కేంద్రంలో కార్పెంటర్ – 18, షీట్ మెటల్ వర్కర్ – 5, పెయింటర్ – 15 సీట్లు ఉన్నట్లు తెలిపారు.

డ్రగ్స్‌తో జీవితాలు ఛిద్రం

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం మాదకద్రవ్యాల దుష్పలితాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ వాడొద్దని, జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్ రహిత సమాజం కోసం తొలగించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రయత్నిస్తోందన్నారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ సి.ఎం.కుమారి డ్రగ్స్ ఫ్రీ దేశంగా తీర్చిదిద్దుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ జి.దాసు, డాక్టర్ ప్రవీణ్, ఎస్.రాజబాబు, సురేష్‌బాబు, ప్రియాంకరాణి తదితరులు పాల్గొన్నారు.

ఔరా.. కర్ర పెండలం



కర్ర పెండలంతో రైతు సన్యాసిరావు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో ఒక కర్ర పెండలం దుంప ఔరా అనిపించింది. కొంతకోట మండలం తోటకూరపాలెం కి చెందిన రైతు సన్యాసిరావు తన పొలంలో పండించిన కర్ర పెండలం 5.10 అడుగుల పొడవు ఉంది. ఈ దుంప ఐదు కిలోల బరువు తూగింది. సాధారణంగా కర్ర పెండలం కేవలం అడుగున్నర పొడవు మాత్రమే ఉంటుంది. ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్‌కు సన్యాసిరావు ఈ కర్ర పెండలం అందజేశారు.



శిథిలావస్థలో బాల్వాం భవనం



సింహగిరి కాలనీలో శిథిలమైన కాలువ



ప్రమాదకరంగా మెట్ల మార్గం

కొండవాలులో సమస్యల తిష్ట

- సింహగిరి కాలనీలో శిథిలావస్థకు చేరిన రోడ్లు, కాలువలు
- ప్రమాదకరంగా మెట్ల మార్గాలు
- ఇబ్బందులు పడుతున్న నివాసులు
- సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి



45వ వార్డు కొండవాలు ప్రాంతం సింహగిరి కాలనీలో రహదారి దుస్థితి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులోని పలు కొండవాలు ప్రాంతాల్లో సమస్యలు తిష్ట వేశాయి. అక్కడి రోడ్లు, డ్రైనేజీలు, మెట్ల మార్గాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో కొండవాలు నివాసులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సింహగిరి కాలనీలో కొన్ని దశాబ్దాల కిందట నిర్మించిన పాత రోడ్లు, డ్రైనేజీలే నేటికీ దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంతంలో రోడ్లు, కాలువలకు మరమ్మతులు చేయకపోవడం వల్ల ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైనేజీలు నిండి, పొంగి ఇళ్లలోకి మురుగునీరు చేరింది. మరికొన్ని ప్రాంతాల్లో కాలువలపై కప్పులు లేవు. దీంతో రాత్రి వేళల్లో పిల్లలు, పెద్దలు ప్రమాదాల బారిన పడుతున్నారు. మరికొన్ని చోట్ల కాలువలపై గల పైకప్పులు ప్రమాదకరంగా, వాటి మీద కాలుపెట్టే తిన్నగా కాలువలో పడిపోయిందే అన్నట్టుగా ఉంది పరిస్థితి. వీటి మీదుగా అవతలి వైపు ఇళ్లకు చేరుకోవడం కష్టంగా ఉంది. దీంతో స్థానికులు తాత్కాలిక ఏర్పాట్లు చేసుకున్నారు.

శిథిలావస్థలో బాల్వాం భవనం

సింహగిరి కాలనీలో చిన్నారుల కోసం నిర్మించిన బాల్వాం భవనం ప్రమాదకర స్థితిలో ఉంది. ఈ విషయమై చాలాసార్లు అధికారులకు విన్నవించినా.. స్పందించ లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ శిథిల భవనంలో ఒకవైపు సచివాలయం, మరోవైపు బాల్వాం తరగతులు నిర్వహించేవారు. ఇటీవల సచివాలయం మారింది. చిన్నారులు మాత్రం ప్రమాదపు అంచుల్లోనే గడుపుతున్నారు. అసలే కొండవాలు ప్రాంతాలు, నిత్యం భయం భయంగా గడుపుతున్నామని, తగిన సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



మా కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి కొన్నేళ్లు గడిచాయి. ఇప్పటివరకు మళ్లీ వేయలేదు. దీంతో నాటి కాలువలు పాడైపోయి ప్రమాదకరంగా మారాయి. వర్షాలు పడితే మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. వెంటనే అధికారులు స్పందించి రోడ్లు, కాలువలు నిర్మిస్తే బాగుంటుంది.

– వి.లక్ష్మి, సింహగిరి కాలనీ

కొత్త భవనం నిర్మించాలి



చిన్నారుల కోసం బాల్వాం భవనం ఉంది. దీనిలోకి చిన్న పిల్లలు వచ్చి, పోతుంటారు. ఈ భవనం గోడల్లో నుంచి భారీ వృక్షం మొలిచింది. ఈ కారణంగా గోడలు బీటలు వారి ప్రమాదపుటంచుల్లో నివసిస్తున్నారు. వెంటనే దీనిని తీసివేసి నూతన భవనాన్ని నిర్మించాలి.

– వై.పైడిరాజు, సింహగిరి కాలనీ

ఆలయాలకు శ్రావణ శోభ

భక్తిశ్రద్ధలతో తొలి శుక్రవారం పూజలు



లలితా పీఠంలో అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



ప్రసన్న వెంకటేశ్వరాలయంలో మహాలక్ష్మికి కుంకుమ పూజ చేస్తున్న భక్తులు

సీతంపేట: శ్రావణ మాసం తొలి శుక్రవారం కావడంతో ఉత్తర నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అలంకరణలు, కుంకుమ పూజలు జరిపారు. అక్కయ్యపాలెం శ్రీ లలితా పీఠం, సీతంపేట పార్వతీశ్వరాలయం, కనకమ్మ ఆలయం, రామచంద్రానగర్ మహాలక్ష్మి సహిత శివసాయి ఆలయం, శ్రీనివాసనగర్‌లోని ప్రసన్న వెంకటేశ్వస్వామి ఆలయాల్లో అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు.

లలితా పీఠానికి పోటెత్తిన భక్తులు

అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరి లలితాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి ఆలయం వద్ద జనం క్యూ కట్టారు. అమ్మవారికి ఉదయం 5 గంటలకు విశేష ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం అనంతరం పూలమాలలు, పట్టు వస్త్రాలు, స్వర్ణాభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల గోత్ర నామాలతో విశేష పూజలు, కుంకుమ పూజలు జరిపారు. సామూహిక లలితాసహస్ర నామ పఠనం చేశారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రసన్న వెంకటేశ్వర ఆలయంలో...

శ్రీనివాసనగర్‌లోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో మహాలక్ష్మి గోదాదేవి, పద్మావతి అమ్మ వార్లకు సామూహిక కుంకుమ పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు భక్తుల గోత్రనామాలతో అర్చన చేసి, అనంతరం అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. రెండో శుక్రవారం ఆలయంలో వరలక్ష్మీ వ్రతం చేస్తామని అర్చకులు తెలిపారు.

నీటి నిల్వలు లేకుండా చూడండి



ఫ్రైడే–డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న జోన్–5 కమిషనర్ కృష్ణ

మల్కాపురం: జీవీఎంసీ 53వ వార్డు శివనగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఫ్రైడే–డ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, దోమల వల్ల వ్యాధులు వస్తున్న నేపథ్యంలో స్థానికులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు వ్యాప్తి చెందకుండా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వ్యర్థాలను తడి, పొడిగా వేరు చేసి ఇంటింటికీ వచ్చే పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని కోరారు. వారానికోసారి ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో సహాయ వైద్యాధికారి సునీల్‌కుమార్, ఎన్‌ఎస్ జనార్దన్, మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది, హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించాలి



మాట్లాడుతున్న ఇస్కఫ్ కార్యదర్శి ప్రభాకర్

సీతంపేట: పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం, ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఐక్యరాజ్య సమితి చొరవ చూపాలని ఇస్కఫ్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. హిరోషిమా, నాగసాకి డే సందర్భంగా రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కఫ్ కార్యదర్శి జె.వి.ప్రభాకర్ మాట్లాడుతూ 1945లో ఆగస్టు 6, 9 తేదీల్లో హిరోషిమా, నాగసాకి నగరాలపై జరిగిన అణుబాంబు ప్రయోగం వల్ల లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. యుద్ధాలు జరగకుండా ఐక్యరాజ్య సమితి గట్టి ప్రయత్నం చేయాలని కోరారు. ఇజ్రాయిల్, పాలస్తీనా మధ్య జరుగుతున్న యుద్ధానికి అమెరికా కొమ్ముకాస్తోందని ఆరోపించారు. దీనివల్ల లక్షలాది మంది నిరాశ్రయులయ్యారన్నారు. ఆయుధ వ్యాపారం కోసమే యుద్ధాలను అమెరికా ప్రోత్సహిస్తోందన్నారు. ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధం మొదలై రెండేళ్లు కావస్తోందని, ఎంతో మంది చిన్నారులు, మహిళలు మృత్యువాత పడ్డారని తెలిపారు. యుద్ధాల వల్ల ఆర్థిక సంక్షోభం తలెత్తి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని, లక్షలాది మంది శరణార్థులుగా మారి శిబిరాల్లో తలదాచుకుంటున్నారన్నారు. ఏఐఎస్ అధ్యక్షులు బి.కల్యాణరావు, గౌతంబాబు, సత్యనారాయణ, యువత పాల్గొన్నారు.

వీధిలైట్లు వెలిగించండి



జెడ్పీ కృష్ణకు వినతిపత్రం అందిస్తున్న వరప్రసాద్ తదితరులు

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణను కలిసి వినతిపత్రం అందించామని చెప్పారు. 50వ వార్డులోని మురళీనగర్ ప్రధాన రహదారులు, పార్కులు, ప్రధాన కూడళ్ల వద్ద చాలా కాలంగా వీధిలైట్లు వెలగడం లేదన్నారు. దీంతో ప్రయాణించే వాహన చోదకులు, పాదచారులు ప్రమాదాల పాలవుతున్నారని చెప్పారు. ముఖ్యంగా స్కేటింగ్ పార్కు, మాధవధార కొండ ప్రాంతంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆలయాలకు వెళ్లే వచ్చే మహిళలపై ప్రధాన కూడళ్ల వద్ద కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి చైన్ స్నాచింగ్ చేస్తున్న సంఘటనలు ఉన్నాయని, గంజాయి బ్యాచ్‌లు తిరుగుతున్నాయని, దీనిపై అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని జెడ్పీకి వరప్రసాద్ వివరించారు. దీనిపై జెడ్పీ కృష్ణ సానుకూలంగా స్పందించారని వరప్రసాద్ తెలిపారు. స్థానిక నాయకులు బత్తుల చక్రవర్తి, నరసింహస్వామి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ విద్యార్థుల బాధ్యత



మాట్లాడుతున్న జె.వి.రత్నం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సీతంపేట: మన పర్యావరణాన్ని మనమే కాపాడుకోవాలని గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పిలుపునిచ్చారు. ద్వారకానగర్ శ్రీసాయి కళాశాలలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మనం పీల్చే గాలిలో రెండు శ్వాసల్లో ఆక్సిజన్ లేకుంటే వ్యక్తి చెందుతున్నారు. అందుచేత 40 నుంచి 80 శాతం ఆక్సిజన్ ఇచ్చే సముద్రాలను మనం కాపాడుకోవాలన్నారు. మొక్కలు నాటి పెంచాలని, చెట్లు కాపాడుకోవాలని కోరారు. రోజుకు 550 లీటర్ల ఆక్సిజన్ వినియోగించుకుంటున్నామని, ప్రస్తుత వాతావరణంలో ఆక్సిజన్ శాతం తగ్గి కర్బన ఉద్గారాల శాతం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. శీతోష్ణస్థితి వేడెక్కకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కళాశాల కార్యదర్శి రామ సత్యనారాయణ మాట్లాడుతూ పర్యావరణ హితంగా జీవించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రకృతి వనరుల పరిరక్షణ విద్యార్థుల తక్షణ కర్తవ్యమని పేర్కొన్నారు. ప్రకృతి వనరులను ధ్వంసం చేసుకుంటే మానవ మనుగడ కష్టమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.గోవిందరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రత్నాకర్, అధ్యాపక సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 67.1 కిలోల గంజాయి పట్టివేత



విశాఖ రైల్వే పోలీసుల అదుపులో గంజాయి రవాణాదారుడు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న యువకుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫాంలపై విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం కల్లికోట జిల్లాకు చెందిన ఓం నాయక్ అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. బలంగిర నుంచి విశాఖపట్నం మీదుగా సూరత్‌కు గంజాయి తరలిస్తున్నట్టు నిందితుడు విచారణలో తెలియజేశాడు. నిందితుడిని అదుపులోకి తీసుకుని సుమారు రూ.3,35,500 విలువైన 67.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

యాచకురాలి మృతి



సీతమ్మధారలో ఫుట్‌పాత్‌పై యాచకురాలు(ఫైల్)

సీతమ్మధార: ఆమె ఎవరో తెలియదు.. ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు.. రోడ్డు పక్కన ఫుట్‌పాత్ మీదే ఉండేది.. నా అన్న వారు లేరు.. ఈ నేపథ్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను పోలీసులు కేజీహెచ్‌లో చికిత్స కోసం చేర్పించారు. దురదృష్టవశాత్తు ఆమె చికిత్స పొందుతూ మరణించింది. ద్వారకా జోన్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. సుమారు 45 ఏళ్ల వయసు గల ఒక మహిళ భిక్షాటన చేసుకుంటూ జీవించేది. ఈమె సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం బస్టాప్‌ను ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్ మీదే నిద్రించేది. ఈ నెల 7న ఆమె అనారోగ్యం పాలవడంతో స్పందించిన ద్వారకా స్టేషన్ పోలీసులు వెంటనే చికిత్స కోసం 108 అంబులెన్సులో కేజీహెచ్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. ద్వారకా పోలీసులు ఆమె మృతికి విచారం వ్యక్తం చేశారు. సీఐ రమేష్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈమె కుటుంబీకులు ఎవరైనా ఉంటే 630518 7009, 94409 04332 నంబర్లకు ఫోన్ చేయాలని సీఐ రమేష్ కోరారు.

జాతీయ జెండాను ఆవిష్కరించనున్న మంత్రి అనగాని

విశాఖ సిటీ: జిల్లాలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీన పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల నిర్వహణ సందర్భంగా ఆయా జిల్లాలకు పతాకావిష్కరణ నిమిత్తం మంత్రులను నామినేట్ చేస్తూ రాష్ట్ర సాధారణ పరిపాలన విభాగం శుక్రవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విశాఖ జిల్లాకు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేరును నోటిఫై చేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొంటూ జిల్లా కలెక్టర్ అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని సూచించింది.

విద్యార్థులకు వితరణ

కంచరపాలెం: కంచరపాలెం ముత్యమాంబ ఆటో స్టాండ్‌లో సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట నరేష్ ఆధ్వర్యంలో శుక్రవారం మహేష్‌బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు అల్పాహారం, విద్యార్థులకు సామగ్రి, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రవి, బుజ్జిబాబు, జి.అప్పారావు, డి.శ్రీను, యశ్వంత్, కిరణ్, వినోద్, తరుణ్, రాజకుమార్, వరప్రసాద్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనతోనే సమర్థవంతంగా విధుల నిర్వహణ

- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ
- పోలీస్ సిబ్బందికి నూతన కిట్ బాక్సుల అందజేత



సిబ్బందికి నూతన కిట్ బాక్సులు అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: పోలీస్ సిబ్బందికి అన్ని సదుపాయాలు కల్పిస్తే సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తారని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆవరణలో సిబ్బందికి నూతన కిట్ బాక్సులు అందజేశారు. అలాగే సిబ్బంది కోసం నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రాంగణం సందర్శించిన ఆయన దృష్టికి సిబ్బంది పలు సమస్యలు తీసుకెళ్లారు. వారి వినతుల మేరకు మొదటి ప్రాధాన్యతగా కొత్త కిట్ బాక్స్‌లు అందజేత, మరుగుదొడ్లు పునర్నిర్మించి ప్రారంభించడం, కొత్త హ్యాండ్ కఫ్స్ మంజూరు చేసి సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఆర్ సిబ్బందికి ఎక్కడ పని ఉంది? ఏమేం కావాలో తెలియజేస్తే ఆ ప్రకారం ఆయా పనులు చేయడానికి అవకాశం ఉంటుందని సూచించారు. తన నంబర్ 79950 95799కు తెలియజేసిన కిట్‌బాక్స్, మరుగుదొడ్లు, హ్యాండ్ కఫ్స్, వెహికల్ పార్కింగ్‌కు షెడ్లు, విశ్రాంతి కోసం మెస్ వెయిటింగ్ హాల్, ఇలా అన్ని సమస్యలను పరిష్కరించినట్టు చెప్పారు. అలాగే ముద్దాయిల ఎస్కార్ట్ విధులకు తగ్గించాలన్న సిబ్బంది విజ్ఞప్తిపై కూడా ఆలోచన చేస్తున్నట్టు చెప్పారు. ఈ విషయంలో కచ్చితంగా అవసరమైతే తప్పా మిగిలిన అన్ని సార్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముద్దాయిలను ప్రొడ్యూస్ చేసే విధానం పరిశీలించాలని అభ్యర్థన లేఖను ఉన్నతాధికారులకు పంపించినట్టు వెల్లడించారు. తమ సంక్షేమానికి పెద్దపీట వేయడంపై సిబ్బంది సీపీకి కృతజ్ఞతలు తెలిపారు.

పర్యాటక ప్రదేశాల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలి

విశాఖ సిటీ: పర్యాటక ప్రదేశాల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలని, పాడైన వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని సంబంధిత అధికారులను విశాఖపట్నం మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన బీచ్ రోడ్‌లో ఉన్న ఐఎన్ఎస్ కురుసుర సబ్ మెరైన్, టీయూ–142 యుద్ధ విమాన మ్యూజియంలను సందర్శించారు. కురుసుర సబ్‌మెరైన్, టీయూ–142 యుద్ధ విమాన మ్యూజియంల పరిసరాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలిచ్చారు. పర్యటనలో వీఎంఆర్‌డీఏ సీతా భవానీ శంకర్, ఈఈ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజనీర్లు రాజు, రామారావు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ మురళి, సహాయక ఇంజనీర్ హసీనా బేగం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.